## వినోద్‌కుమార్ శుక్లాకు జ్ఞానపీఠ్ అవార్డు

### అత్యున్నత పురస్కారానికి ఎంపికైన మొదటి ఛత్తీస్‌గఢ్ రచయిత



న్యూఢిల్లీ: దేశంలోనే అత్యున్నత సాహిత్య పురస్కారం జ్ఞానపీఠ్‌కు ప్రముఖ హిందీ రచయిత వినోద్‌కుమార్ శుక్లా ఎంపికయ్యారు. ఛత్తీస్‌గఢ్ నుంచి ఈ అవార్డు అందుకోనున్న మొదటి రచయిత శుక్లానే కావడం విశేషం. 2024 ఏడాదికి సంబంధించి జ్ఞానపీఠ్ ఎంపిక కమిటీ 59వ అవార్డు గ్రహీతను శనివారం ప్రకటించింది. లఘు కథల రచయిత, కవి, వ్యాసకర్తగా పేరొందిన 88 ఏండ్ల శుక్లా హిందీ భాషలో గొప్ప సమకాలీన రచయితలలో ఒకరు. హిందీ భాష నుంచి ఈ అవార్డు అందుకున్న వారిలో శుక్లా 12వ వ్యక్తి. అవార్డు కింద రూ.11 లక్షల నగదు, సరస్వతి కాంస్య విగ్రహం, ప్రశంసా పత్రం అందజేస్తారు.

## మణిపూర్‌లో సుప్రీంకోర్టు జడ్జిల పర్యటన

### మణిపూర్‌ను మోదీ ఎప్పుడు సందర్శిస్తారు?: జైరాం రమేశ్



ఇంఫాల్, మార్చి 22: కార్యనిర్వాహక, శాసన, న్యాయ వ్యవస్థల సాయంతో ప్రస్తుత కష్టకాలాన్ని మణిపూర్ రాష్ట్రం త్వరలోనే అధిగమించి మునుపటి వైభవాన్ని సంతరించుకుంటుందన్న ఆశాభావాన్ని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ వ్యక్తం చేశారు. ఆరుగురు సుప్రీం కోర్టు న్యాయమూర్తులతో కూడిన బృందం శనివారం కల్లోలిత మణిపూర్ రాష్ట్రంలో పర్యటించింది. చురాచాంద్‌పూర్‌లోని సహాయ శిబిరాన్ని బృందం సందర్శించింది. న్యాయ సేవల విభాగాన్ని, వైద్య శిబిరాన్ని, న్యాయ సహాయ క్లినిక్‌లను వారు వర్చువల్‌గా ప్రారంభించారు. మణిపూర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ఎప్పుడు పర్యటిస్తారని కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ ప్రశ్నించారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తులు శనివారం మణిపూర్‌ను సందర్శించడాన్ని ఆయన స్వాగతించారు.

## 5.32 లక్షల మందికి లీగల్ స్టేటస్ రద్దు

### తాత్కాలిక వలసదారులపై ట్రంప్ సర్కారు కొరడా

*వాషింగ్టన్, మార్చి 22: అమెరికాలో అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతున్న డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం.. తాజాగా తాత్కాలిక వలసదారులపై కొరడా ఝుళిపించింది. అమెరికా వ్యాప్తంగా 5 లక్షల మందికిపైగా వలసదారులకు తాత్కాలిక నివాస హోదాను రద్దు చేస్తున్నట్టు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ (అమెరికా ఆంతరంగిక భద్రతా శాఖ) ప్రకటించింది. క్యూబా, హైతీ, నికరాగ్వ, వెనెజులా దేశాల నుంచి వలస వచ్చిన లక్షల మందికి చట్టపరమైన రక్షణను రద్దు చేస్తున్నట్టు వెల్లడించింది. 2022 అక్టోబర్ తర్వాత ఆ 4 దేశాల నుంచి అమెరికాకు వలసవచ్చిన దాదాపు 5.32 లక్షల మందికి ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని, దీంతో వారిని నెల రోజుల్లో అమెరికా నుంచి బహిష్కరిస్తామని స్పష్టం చేసింది. వీరంతా అమెరికాలో నివసించేందుకు పొందిన లీగల్ స్టేటస్‌ను ఏప్రిల్ 24న లేదా ఫెడరల్ రిజిస్టర్‌లో నోటీసులు ప్రచురించిన 30 రోజుల తర్వాత కోల్పోతారని తెలిపారు. తాత్కాలికంగా అమెరికాకు వచ్చి రెండేండ్లపాటు నివసించేందుకు వీలుగా అధ్యక్షుడు మానవతా దృక్పథంతో ఈ లీగల్ స్టేటస్‌ను కల్పిస్తారు.*



**ఒక్క రోజులో 1,000 'గోల్డ్ కార్డు'ల విక్రయం**

*అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించిన 'గోల్డ్ కార్డు'కు విపరీతంగా డిమాండ్ ఉన్నట్టు తెలుస్తోంది. కేవలం ఒక్క రోజులోనే 1,000 గోల్డ్ కార్డులను విక్రయించినట్టు అమెరికా వాణిజ్య శాఖ మంత్రి హోవర్డ్ లుట్నిక్ శనివారం ప్రకటించారు. తద్వారా 5 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.43,000 కోట్లు) సమీకరించినట్టు వెల్లడించారు. ఓ పాడ్‌కాస్ట్‌లో ఆయన మాట్లాడుతూ.. గోల్డ్ కార్డును కొనేందుకు లక్షల మంది సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. 10 లక్షల మంది కొనుగోలు చేసినా 5 లక్షల కోట్ల డాలర్లు (దాదాపు రూ.4,30,00,175 కోట్లు) సేకరించవచ్చని ట్రంప్ భావిస్తున్నారని తెలిపారు.*

## బ్యాంకుల సమ్మె వాయిదా

*న్యూఢిల్లీ: ఈ నెల 24, 25 తేదీల్లో తలపెట్టిన దేశవ్యాప్త బ్యాంకుల సమ్మెను వాయిదా వేసినట్టు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ప్రకటించింది. సెంట్రల్ లేబర్ కమిషనర్‌తో శుక్రవారం జరిగిన చర్చలు సానుకూల ఫలితాలనిచ్చినట్లు తెలిపింది. బ్యాంకుల ఐదు రోజుల పని దినాలు, నియామకాలు, పనితీరు ప్రోత్సాహకాలు (పీఎల్‌ఐ) సహా ఇతర అంశాలపై మరింత చర్చించాలని ప్రతిపాదించినట్లు వెల్లడించింది. తమ డిమాండ్ల పట్ల సానుకూల పరిణామాల నేపథ్యంలో సమ్మెను ఒకట్రెండు నెలలు వాయిదా వేయాలని నిర్ణయించినట్లు తెలిపింది. తదుపరి చర్చలు ఏప్రిల్ మూడో వారంలో జరుగుతాయని పేర్కొంది.*

## ఉల్లిపై ఎగుమతి సుంకం రద్దు

న్యూఢిల్లీ: ఉల్లిపై 20 శాతం ఎగుమతి సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఈ నిర్ణయం వచ్చే నెల 1 నుంచి అమల్లోకి వస్తుంది. రైతుల ప్రయోజనాలను కాపాడటం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం వెల్లడించింది. వినియోగదారులకు ఉల్లిపాయలు సరసమైన ధరలకు అందుబాటులో ఉంటాయని కేంద్రం తెలిపింది.

## లేజర్ కిరణాలతో షుగర్ టెస్ట్!

- సూది గుచ్చకుండానే గ్లూకోజ్ స్థాయి నిర్ధారణ
- ఐఐఎస్‌సీ శాస్త్రవేత్తల కొత్త సాంకేతికత

న్యూఢిల్లీ: రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు కొలవడం మధుమేహ బాధితులకు పెద్ద సమస్య. సూదితో చర్మాన్ని గుచ్చి రక్తాన్ని సేకరిస్తుంటారు. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ) శాస్త్రవేత్తలు దీనికి ప్రత్యామ్నాయాన్ని కనుగొన్నారు. చర్మానికి కోతపెట్టాల్సిన అవసరం లేకుండా కాంతి (లేజర్ కిరణాలు) సాయంతో రక్తంలో గ్లూకోజ్ స్థాయిని కొలిచే మార్గాన్ని వారు కనుగొన్నారు. 'ఫొటోఅకౌస్టిక్ సెన్సింగ్' టెక్నాలజీలో కణజాలం సంకోచించి.. వ్యాకోచిస్తుంది. ఈ క్రమంలో చిన్నపాటి ప్రకంపనల్ని డిటెక్టర్లు పసిగడతాయి. ధ్వని తరంగ తీవ్రతను అనుసరించి గ్లూకోజ్ స్థాయిని నిర్ణయిస్తామని సైంటిస్టులు చెబుతున్నారు.

## భాషా వివాదంపై కర్ణాటక బంద్

బెంగళూరు: భాషా వివాదంపై కన్నడ సంఘాలు శనివారం నిర్వహించిన కర్ణాటక బంద్ ప్రశాంతంగా ముగిసింది. బెళగావిలో గత నెలలో ఓ బస్ కండక్టర్‌కు మరాఠీ మాట్లాడటం రాదనే నెపంతో ఆయనపై దాడి చేయడాన్ని నిరసిస్తూ ఈ బంద్‌ను నిర్వహించారు. పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడంతో అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. ఇదిలావుండగా, నిరసనకారులు కోరినప్పటికీ కొన్ని దుకాణాల యజమానులు యథావిధిగానే తమ కార్యకలాపాలను కొనసాగించారు.

## జస్టిస్ వర్మపై విచారణకు త్రిసభ్య కమిటీ

న్యూఢిల్లీ, మార్చి 22: అధికారిక నివాసంలో మంటలు చెలరేగి భారీ మొత్తంలో నగదు బయటపడినట్టు జస్టిస్ యశ్వంత్ వర్మపై వచ్చిన ఆరోపణలపై అంతర్గత విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా శనివారం ఓ త్రిసభ్య కమిటీని నియమించారు. జస్టిస్ వర్మకు ఎటువంటి అధికారిక విధులను అప్పగించవద్దని కూడా సీజేఐ ఆదేశించారు. ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీకే ఉపాధ్యాయ నుంచి నివేదిక అందిన తర్వాత సీజేఐ ఖన్నా విచారణ కమిటీని నియమించారు.

